జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

ఆదివారం | 25-5-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 349 పేజీలు: 4 వెల : రూ.7

# విజయాదిత్య పార్కు.. కన్నీటి గాథ!




*** వైభవం నుంచి వినాశనానికి? * ఒకప్పుడు స్వర్గధామం.. ఇప్పుడు నేరాలకు అడ్డా * పచ్చని పార్కులో పెరిగిన చెత్త * ఎటు చూసినా మద్యం సీసాలే * పార్కులో అంతంత మాత్రంగానే పునరుద్ధరణ * కలెక్టర్ ఆదేశాలు నీటి మూటలేనా?**



**శ్రీకాకుళం, మే 24, (వార్త ప్రతినిధి):** శ్రీకాకుళం నగర శివార్లలో 11 ఎకరాల విస్తీర్ణంలో అలనాటి వైభవానికి ఆనవాలుగా నిలిచిన విజయాదిత్య పార్కు... పర్యాటకులకు స్వచ్ఛమైన గాలిని, ఆనందాన్ని పంచిన స్వర్గధామం. కానీ ఇప్పుడు.. సంధ్య వేళల్లో ఓ చీకటి నిలయం, నేరాలకు అడ్డా. పగటిపూట ప్రేమజంటలకు నిలయంగా ఉండేది. ప్రస్తుతం అడుగుపెట్టడానికే అసహ్యించుకునే దుస్థితి! పాతికేళ్ల క్రితం, ఒక గొప్ప కలతో ఈ పార్కును తీర్చిదిద్దారు. మధ్యలో బోటింగ్ చేసే సాగరం, రంగురంగుల పూల తోటలు, పిల్లల ఆటస్థలం... అన్నీ అద్భుతమే! సీపన్నాయుడు పేట, భైరవాని పేటకు మధ్య జాతీయ రహదారి పక్కనే ఉండటంతో, ఇది నగరానికి ఓ గుండెకాయలా నిలిచింది. అప్పటి కలెక్టర్ విజయనంద్, ప్రజాప్రతినిధుల సహకారంతో ఈ కల సాకారమైంది.

## కరిగిపోయిన కల..

గత 15 ఏళ్లుగా, ఈ పార్కును పట్టించుకునే నాథుడే లేడు. కాలం గడిచే కొద్దీ, పార్కు చుట్టూ ఉన్న రైతులు అంగుళం అంగుళం భూములను ఆక్రమించుకుంటూ వచ్చారు. పార్కులోకి అడుగుపెడితే గుండె తరుక్కుపోతుంది. ఎక్కడ చూసినా పగిలిన మద్యం సీసాలు, బీరు బాటిళ్లు, వాడిన కండోమ్‌లు, ఆహార వ్యర్థాలు... మనుషులు చేయకూడని పనులన్నీ ఇక్కడే! ఇది పార్కా లేక వ్యర్థాల కుప్పా? మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట ఇది!

విజయాదిత్య సాగరం ఒకప్పుడు బోటింగ్ చేస్తూ పక్షుల కిలకిలరావాలు వినే చోటు. ఇప్పుడు అది పచ్చటి నీరు లేని ఓ తాటికాయలా మారిపోయింది.





## ఆచరణకు నోచుకోని ఆశలు..

2024 సెప్టెంబర్ 20న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి పార్కును పరిశీలించారు. వారి ఆదేశాలు విన్నప్పుడు కాస్త ఆశ చిగురించింది. పార్కును శుభ్రం చేయాలి, కొత్త డీపీఆర్ (వివరమైన ప్రాజెక్ట్ నివేదిక) తయారుచేయాలి. మరుగుదొడ్లు, విద్యుత్తు, బెంచీలు, ఓపెన్ జిమ్, ఫలహారశాల వంటి మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అయితే ఈ ఆదేశాలు కేవలం మాటలకే పరిమితమయ్యాయి. ఆ తర్వాత వచ్చిన మార్పులు ఎక్కడా కనిపించలేదు. డీపీఆర్ సంగతి పక్కన పెడితే, చెత్త ఎత్తే కూలీలు కూడా సరిగా రాలేదు. శుభ్రత మామూలే. మళ్లీ అదే నిర్లక్ష్యం!

బోట్లు మూలల్లో చెత్తతో కలిసి కుళ్లిపోతున్నాయి. ఓపెన్ జిమ్ పూర్తిస్థాయిలో ధ్వంసమైంది. కూర్చోవడానికి వేసిన బెంచీలు విరిగిపోయాయి. పార్కులోకి వెళ్లే ప్రతి అడుగులోనూ చీకటి, భయం... ఇదంతా చూస్తుంటే కడుపు తరుక్కుపోతుంది.



## ప్రజల గుండెల్లోని ఆవేదన.. ప్రభుత్వానికి వినిపిస్తుందా?

"పిల్లలతో బయటికి వెళ్లే చోటే లేదు. ఉన్న పార్కును కూడా ఇలా వదిలేస్తే ఎక్కడికి వెళ్తాం?" అని ఓ తల్లిదండ్రి కన్నీళ్లు పెట్టుకుంటారు. "పర్యాటక అభివృద్ధి అంటే ఇలాంటి పార్కుల నుంచే మొదలవ్వాలి" అని మరో స్థానికుడు ఆవేదన వ్యక్తం చేస్తాడు. ఇది కేవలం మాటలు కాదు, ప్రజల గుండెల్లోంచి వస్తున్న ఆవేదన! శ్రీకాకుళం జిల్లాకు ప్రభుత్వ ఆదరణ ఎంతో అవసరం. ఉన్న వనరులను సంరక్షించకుండా, కొత్త అభివృద్ధి మాటలకే పరిమితమవుతుంది. విజయాదిత్య పార్కు.. ఇది కేవలం ఒక చిన్న సమస్య కాదు. ఇది జిల్లా అభివృద్ధికి, ప్రభుత్వ చిత్తశుద్ధికి ఒక పరీక్షపత్రం. ఇది సమయస్ఫూర్తిగా ప్రభుత్వానికి, అధికారులకు, ప్రజలకు ఒక రిమైండర్ కావాలి.. ఈ పార్కు మనదే! ఇది మన వారసత్వం! దీన్ని కాపాడుకుందాం! లేకపోతే ఈ విజయాదిత్య పార్కు... చరిత్రలో కేవలం ఓ కన్నీటి గాథగా మిగిలిపోతుంది.


ఫైల్ ఫోటో

# ఎంజీఆర్ ఆధ్వర్యంలోనే.. ఇసుక అక్రమ రవాణా



*** అంగూరు, నివగాంలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు * ఒడిశాకు తరలింపు * గోవిందరావు.. ఇసుకను దోచుకునే నాయకుడు * మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ధ్వజం**

**కొత్తూరు, మే 24 (వార్త):** ఎంజీఆర్ ఆధ్వర్యంలోనే ఇసుక అక్రమ రవాణా సాగుతోందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తూరు ఇసుక ర్యాంపుల నుండి ఇసుక దోపిడీ యథేచ్ఛగా జరుగుతోందని వైసీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తూరు మండలంలోని వంశధార నదిలోని అంగూరు (ఆకులతంపర), నివగాం ఇసుక ర్యాంపుల నుంచి నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయన్నారు. ఆంధ్ర నుండి ఒడిశాకు ఇసుక అక్రమ రవాణా జరుగుతోందన్నారు. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ ఒడిశాకు తన అనుచరుల ద్వారా ఇసుకను తరలించేసి కాసులు చేసుకుంటున్నారన్నారు. నియోజకవర్గం అభివృద్ధి పట్టించుకోకుండా వ్యాపారస్తుడుగా, ఇసుక దోచుకునే నాయకుడుగా పేరు నిలబెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. రానున్న రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని రెడ్డి శాంతి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## ఆమె నేత్రాలు సజీవం



**శ్రీకాకుళం, మే 24(వార్త):** శ్యామ్‌పాలెం గ్రామం (సానివాడ)కు చెందిన దొండపాటి రేష్మా (21) శనివారం మృతి చెందారు. దీంతో ఆమె నేత్రాలను దానం చేయాలని తల్లిదండ్రులు పురుషోత్తందేవ్, పద్మావతి నిర్ణయించుకు న్నారు. ఈ విషయాన్ని దొండ పాటి రమేష్.. రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావుకు తెలియజేసారు. దీంతో మగటపల్లి కళ్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం ఐ టెక్నీషియన్ పూతి సుజాత, పి.సుమతి ఆమె కార్నియాలు సేకరించి విశాఖపట్నంలోని ఎల్.వి.ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు.

ఆమె మృతికి సంతాపం తెలియజేస్తూ దాత కుటుంబ సభ్యులను రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, సెక్రటరీ మల్లేశ్వరరావు, ట్రెజరర్ దుర్గా శ్రీనివాస్, ఇతర సభ్యులు అభినందించారు. అంధత్వ రహిత సమాజ స్థాపనకు యువత, ప్రజలు కృషి చేయాలన్నారు. నేత్ర దానం చేయాలనుకునే వాళ్ళు 7842699321 నంబరుకు కాల్ చేయాలని కోరారు.

# ప్రతి గ్రామానికి ఆర్థిక పరిపుష్టి చేకూరాలి

**-ప్రాధాన్యతా రంగాల్లో సమన్వయంతో లక్ష్యాలు అధిగమించండి**

**- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**



**శ్రీకాకుళం, మే 24(వార్త):** జిల్లాలోని ప్రతి గ్రామాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ డా. స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రైమరీ సెక్టార్స్ (ప్రాథమిక రంగం) పై సమీక్షా సమావేశంలో ఆయన వివిధ శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**సమగ్ర సమీక్ష, దిశానిర్దేశం :**

వ్యవసాయం, ఉద్యానవన, సెరికల్చర్, వంశధార, ఏపీఎంఐడీసీ వంటి కీలక శాఖల అధికారులతో కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు అంశాలపై సమగ్రంగా చర్చించారు. గ్రామాల సామాజిక, ఆర్థిక పరిస్థితులను, వనరులను గుర్తించి, వాటిని సద్వినియోగం చేసుకునేందుకు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. తొలుత ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రారంభించాలని లక్ష్యంగా నిర్దేశించారు.

**మల్టీ సెక్టోరల్ అభివృద్ధి లక్ష్యం:**

వ్యవసాయం, ఉద్యానం, పాడిపరిశ్రమ, మత్స్య, పౌల్ట్రీ, పట్టుపరిశ్రమ, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, స్వయం సహాయక సంఘాలు, బ్యాంకుల భాగస్వామ్యంతో గ్రామాల్లో సమగ్ర ఆర్థిక పరిపుష్టి సాధించడం ముఖ్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. రాబోయే మూడేళ్లలో ఎంపిక చేసిన గ్రామాలను పూర్తిగా పచ్చదనంతో నింపాలని, సాగులో 60% ఉద్యాన పంటలు ఉండేలా ప్రోత్సహించాలని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో అధిక దిగుబడులు సాధించేందుకు యాజమాన్య పద్ధతులపై రైతుల్లో అవగాహన పెంపొందించాలని సూచించారు.

**కీలక రంగాలపై దృష్టి:**

సాయిల్ వెల్త్ ప్రాసెసింగ్ సెంటర్ల బలోపేతం, రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్‌పీఓలు) బలోపేతం, ఫారం పాండ్ల పరిధిలో ఉద్యాన మొక్కలతో కొత్త ఎకో సిస్టమ్ ఏర్పాటుపై దృష్టి సారించాలని, డ్రోన్ల వినియోగం పెంచాలని కలెక్టర్ ఆదేశించారు. తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో సూక్ష్మ సాగు (మైక్రో ఇరిగేషన్) ద్వారా సాగుబడిని విస్తరించాల్సిన అవసరాన్ని ఆయన గుర్తు చేశారు. మార్క్‌ఫెడ్ సహకారంతో ఎరువులు, మందులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**సంస్థాగత భాగస్వామ్యం:**

వైవిధ్యమైన శాఖల సమన్వయంతో గ్రామాల అభివృద్ధిని వేగవంతం చేయాలని, వ్యవసాయం, ఆరోగ్యం, మార్కెటింగ్, పారిశ్రామిక పెట్టుబడుల పరంగా గ్రామాలు ముందుకు సాగాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో సిపిఓ లక్ష్మీ ప్రసన్న, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి త్రినాథస్వామి, ఉద్యానవన శాఖ ఏడీ ప్రసాదరావు, ఏపీఎంఐపి డిడీ శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## కాంప్లెక్స్‌లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలి

**శ్రీకాకుళం, మే 24(వార్త):** శ్రీకాకుళంలో గల ఆర్టీసీ కాంప్లెక్స్ లో మౌలిక సదుపాయాలు మరింత మెరుగు పరచాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. శనివారం ఆర్టిసి కాంప్లెక్స్ ను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కాంప్లెక్స్ లో మరుగుదొడ్లు, తాగునీరు, పరిసరాల పరిశుభ్రత, తదితర అంశాలను పరిశీలించి ఆర్టీసీ అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం మరికొన్ని చోట్ల తాగునీటి సదుపాయాన్ని కల్పించాలని ఆదేశించారు. ఆర్టీసీ బస్సులు ప్రయాణీకులకు బస్సుల సమయాలను తెలియచేసే సమాచార పట్టికలను పరిశీలించారు. ప్రయాణీకులతో బస్ స్టేషన్ లో గల సౌకర్యాలను గూర్చి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్టీసీ అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేసారు. జిల్లా ప్రజా రవాణా అధికారి ఆకాశపు విజయకుమార్, ఒకటి, రెండవ డిపో మేనేజర్లు అమరసింహుడు, శర్మ,, సూపర్ వైజర్లు, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## బాలల రక్షణ, సంరక్షణపై అవగాహన



**పలాస, మే 24(వార్త):** పలాస రైల్వే స్టేషన్ నందు శనివారం నాడు జిల్లా బాలల రక్షణ అధికారి ఆదేశముల మేరకు జిఆర్పి ఏఎస్ఐ చక్రధర్, హెచ్ సి సోమేశ్వరరావు సమక్షంలో పలాస రైల్వే చైల్డ్ హెల్ప్ డెస్క్ సూపర్వైజర్ బాల సరస్వతి ప్లాట్ఫారం లో ఉన్న రైలు ప్రయాణికులకు 1098 సేవల గూర్చి, బాల కార్మికుల గూర్చి, బిక్షాటన గూర్చి, తప్పిపోయిన, పారిపోయిన పిల్లల గూర్చి మొదలగు వంటి అంశాల పైన అవగాహన కల్పించారు. జిఆర్పి ఏఎస్ఐ ప్రయాణికులను ఉద్దేశించి రైలు ఎక్కేటప్పుడు తమ వస్తువులను జాగ్రత్త పరచుకోవాలని, గంజాయిని అక్రమంగా తరలించిన ఎడల తగిన చర్యలు తీసుకుంటామని చెప్పడం జరిగింది. హెడ్ కానిస్టేబుల్ మాట్లాడుతూ రైల్లో జరిగే దొంగతనాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిఆర్పి ఏఎస్ఐ చక్రధర్ హెచ్ సి సోమేశ్వరరావు, చైల్డ్ హెల్ప్ డెస్క్ సూపర్వైజర్ బాల సరస్వతి మరియు రైలు ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా మహిళల రుణ ప్రణాళిక

**మందస, మే 24(వార్త):** మహిళా సంఘాల వార్షిక రుణ ప్రణాళికలో మైక్రో క్రెడిట్ ప్లాన్ పక్కాగా పారదర్శకంగా ఉండాలని జిల్లా ఉన్నతి డీపీఎం జి.శ్రీధర్ తెలిపారు. మందస పరిధిలో వెలుగు ఐటిడిఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా సంఘాల అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సూక్ష్మ రుణ ప్రణాళికను పరిశీలిస్తూ, సంఘ సభ్యుల అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మైక్రో క్రెడిట్ ప్లాన్ తయారు చేసినప్పుడు సభ్యుల బయోమెట్రిక్ ను కూడా తీసుకోవాలని తెలిపారు. అన్ని సంఘాలకు ప్రతినెలా మీటింగు జరిగే ప్రదేశాన్ని జియో ఫెన్సింగ్ చేయించాలని, సభ్యుల హాజరు కొరకు ముఖ నమోదును ఫేసువల్ యాప్ లో నమోదు చేయాలని సూచించారు. వార్షిక రుణ ప్రణాళికలో సభ్యులు బ్యాంకు నుండి తీసుకున్న రుణాలలో కనీసం 70 శాతం ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలకు మాత్రమే వినియోగించాలని అవగాహన కల్పించారు. యాక్టివిటీ చేస్తున్న మహిళలకు డాక్యుమెంటేషన్ చేయించి వ్యక్తిగతంగా ఉమెన్ లెడ్ ఎంటర్ప్రైజెస్ రుణాలను బ్యాంకుల ద్వారా మంజూరు చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సంఘాల ప్రతినిధులతో పాటు వి.వో.ఏ.లు నీరజ, శారద, నాగమణి, క్లస్టర్ కోఆర్డినేటర్లు బాలకృష్ణ, తారక్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.



# తెలుగు సినీ పరిశ్రమకు 'కనీస కృతజ్ఞత లేదు'

**-పవన్ కళ్యాణ్ తీవ్ర వ్యాఖ్యలు**



**అమరావతి, మే 24 (వార్త):** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తెలుగు చలనచిత్ర పరిశ్రమపై నిప్పులు చెరిగారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సినీ రంగానికి ఎన్నో అనుకూల నిర్ణయాలు తీసుకున్నప్పటికీ, పరిశ్రమకు "కనీస కృతజ్ఞత" లేదని ఆయన తీవ్రంగా ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం పట్ల సినీ ప్రముఖుల వైఖరి పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.

**వ్యక్తిగత కలయికలకు స్వస్తి, విధానపరమైన చర్చలే:**

సినీ రంగంలోని వ్యక్తులు ఇకపై తనను వ్యక్తిగతంగా కలవడానికి రావద్దని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారం కోసం సినీ సంఘాల ప్రతినిధులు, నిర్మాణ మండలి వంటి అధికారిక వేదికల ద్వారానే ప్రభుత్వంతో చర్చలు జరపాలని సూచించారు. "కూటమి ప్రభుత్వం వ్యక్తుల్ని కాదు, సినిమా రంగ అభివృద్ధిని మాత్రమే చూస్తుంది" అని ఆయన తేల్చి చెప్పారు.

**గత ప్రభుత్వ వైఖరిపై విమర్శలు :**

గత ప్రభుత్వం సినీ రంగాన్ని, ముఖ్యంగా అగ్ర నటులను ఎలా చిన్నచూపు చూసిందో సినీ పరిశ్రమ మర్చిపోయిందని పవన్ కళ్యాణ్ ధ్వజమెత్తారు. టికెట్ ధరల నియంత్రణ, ఆన్‌లైన్ టికెటింగ్ విధానం వంటి అంశాలపై గతంలో వై.ఎస్.ఆర్.సి.పి. ప్రభుత్వం కఠినంగా వ్యవహరించిందని, దాని వల్ల సినీ పరిశ్రమకు నష్టాలు వాటిల్లాయని పవన్ కళ్యాణ్ పదే పదే ప్రస్తావించారు. ఆ సమయంలో సినీ పరిశ్రమ పెద్దలు సైతం నిస్సహాయంగా ఉన్నారని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం స్నేహపూర్వకంగా వ్యవహరిస్తున్నా, పరిశ్రమ నుంచి సరైన స్పందన లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ప్రోత్సాహం, మద్దతు లేదన్న ఆరోపణ:**

కూటమి ప్రభుత్వం ఏర్పాటై దాదాపు ఏడాది అవుతున్నప్పటికీ, తెలుగు సినీ సంఘాల ప్రతినిధులు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని మర్యాదపూర్వకంగా కలవకపోవడంపై పవన్ కళ్యాణ్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కేవలం తమ సినిమా విడుదలైనప్పుడు, ప్రత్యేక ప్రదర్శనలు, టికెట్ ధరల పెంపు వంటి అనుమతుల కోసం మాత్రమే సినీ ప్రముఖులు ప్రభుత్వ అధికారులను కలుస్తున్నారని, కానీ రాష్ట్ర ప్రభుత్వానికి మద్దతు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయన విమర్శించారు.

**భవిష్యత్తు కార్యాచరణ :**

ఈ వ్యవహారంపై త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి, సినీ పరిశ్రమ అభివృద్ధికి ఒక సమగ్ర విధానాన్ని రూపొందించనున్నట్లు పవన్ కళ్యాణ్ కార్యాలయం నుండి ప్రకటన వెలువడింది. రాష్ట్రంలో సినీ రంగానికి సంబంధించి థియేటర్ల ఆదాయాలు, ప్రభుత్వానికి చెల్లించే పన్నుల వంటి వివరాలను కూడా పవన్ కళ్యాణ్ పరిశీలించినట్లు సమాచారం.

పవన్ కళ్యాణ్ చేసిన ఈ సంచలన వ్యాఖ్యలు తెలుగు సినీ పరిశ్రమలో పెద్ద దుమారాన్ని రేపాయి. ఆయన వ్యాఖ్యలపై సినీ ప్రముఖులు, నిర్మాతలు, దర్శకుల నుండి భిన్నమైన స్పందనలు వ్యక్తమయ్యే అవకాశం ఉంది. ఈ పరిణామాలు భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి, తెలుగు సినీ పరిశ్రమకు మధ్య సంబంధాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయో చూడాలి. గతంలో కూడా టికెట్ ధరల వివాదంపై పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు సినీ పరిశ్రమలో చర్చనీయాంశమయ్యాయి.

# క్రీడాకారులు కలిసికట్టుగా ముందుకు సాగాలి

**- సూదికొండ క్రికెట్ పోటీల విజేత రాజు లెవెన్**

**-బహుమతి ప్రదానంచేసిన వైసీపీ పట్టణ అధ్యక్షుడు గోపి**



**పలాస, మే 24(వార్త):** క్రీడాకారులు అంతా కలిసికట్టుగా ముందుకు సాగాలని పలాస పట్టణ వైసిపి అధ్యక్షులుశిస్టు గోపి గోపి అన్నారు. (కేపీఎల్ )క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేశారు.సూదికొండ ప్రీమియర్ లీగ్ ( కేపీఎల్ ) క్రికెట్ టోర్నమెంట్ లో భాగంగా శనివారంఫైనల్ మ్యాచ్ నిర్వహించి విజేతలకు ప్రథమ ద్వితీయ బహుమతులు అందజేశారు.సూది కొండలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ రాజు లెవెన్ విజేతకు ఆరువేలు నగదు, షీల్డ్ రన్ రప్ గా సారధి లెవెన్ జట్టుకు 4000 రూపాయలు, షీల్డ్ అందజేశారు. విజేతలకు బహుమతులు ప్రధానోత్సవం లో భాగంగా గోపి మాట్లాడుతూ సమైక్యతకు క్రీడాకారులు రోల్ మోడల్ కావాలని, క్రీడలతో శారీరిక ఉల్లాసం, మానసిక ఉల్లాసం పెంపొందించుకోవచ్చని చెప్పారు. క్రీడల్లో ఒక్కరే విజేతగా నిలుస్తారని, వాటమికి కుంగిపోకుండా పట్టుదలతో గెలుపుకు బాటలు వేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సింహాచలం,జోగ తిరుపతి, క్రీడాకారులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## 27న అన్నపూర్ణమ్మ ఆలయ 15వ వార్షికోత్సవం



**మందస, మే 24(వార్త):**మందస గ్రామదేవత అన్నపూర్ణమ్మ ఆలయ 15వ వార్షికోత్సవం ఈ నెల 27న నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆ రోజు ఉదయం 7గంటలకు ఇప్పిలి ఋషి గురుభవాని పర్యవేక్షణలో భవానీ స్వాముల ఆధ్వర్యంలో ప్రత్యేక హెూమం నిర్వహించబడు తుందన్నారు. 8గంటలకు దేవాంగుల వీధి నుంచి గ్రామ దేవత గుడి వరకు ముగ్రాటలతో ఊరేగింపు జరుపుతామన్నారు. అనంతరం భక్తులతో చల్లదనం కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆ రోజు మధ్యాహ్నం 11గంటల నుంచి నారాయణసేవ కార్యక్రమం జరుగు తుందని, భక్తులు కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

# చినుకు పడితే బురదమయం ..!

**-వర్షాలకు రోడ్లు గుంతలమయం - ఎక్కడ గుంత ఉందో తెలియని పరిస్థితి -నరకం చూస్తున్న వాహనదారులు, ప్రయాణికులు**







**కొత్తూరు, మే 24 (వార్త):** కొత్తూరులోని అంబేద్కర్ నాలుగు రోడ్ల జంక్షన్‌లో చినుకు పడితే రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. రోడ్లు బురదమయంగా మారుతుండ డంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వానొస్తే నడిచే పరిస్థితి లేకుండా పోయింది. బస్టాండ్‌లోని ఇరువైపులా రోడ్లలో గుంతలు పడి బస్సుల రాకపోకలకు కూడా అంతరా యం కలుగుతుంది. రోడ్డుపై అప్పటికే గుంతలు పడి ఉండడంతో వర్షపు నీరు నిలవడంతో గుంతలు ఎక్కడ ఉన్నాయో తెలియక వాహనదారులు ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. ఆసలే కొత్తూరు మండల రోడ్లు గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్న రహ దారి ఈ వర్షాలకు మరింత ఆధ్వానంగా మారింది. ఇక ఇది చాలదన్నట్లు డ్రైనేజి కాలువలు సరిగా లేనందున ఆ దుర్వాసన కలిగిన మురికి నీరు కూడా ఈ రహదారుల వెంటే ఎరులై పరుతూ ఉంటుంది. ఈ రహదారులకు మోక్షం ఎప్పుడు కలుగుతుందోనని మండల ప్రజలు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

## జర్మనీ మినీ మహానాడులో ఎమ్మెల్యే శిరీష

**పలాస, మే 24(వార్త):** జర్మనీలో శనివారం జరిగిన టీడీపీ మినీ మహానాడుకు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష హాజరయ్యారు. అన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి, దీపాలు వెలిగించి, వేడుకలు ఘనంగా ప్రారంభించారు. ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అభినందనలు, ముఖ్యమంత్రి చంద్రబాబు సందేశం వినిపించారు. పుల్వామా అమరవీరులకు నివాళులర్పించి, చంద్రబాబు పి 4 మీద ఆంధ్ర రాష్ట్రానికి చేయూత, కూటమి విజయంపై హర్షం, జర్మనీ చుట్టు పక్కల దేశాల్లో నివసిస్తున్న తెలుగు వారికి ఆపద సమయంలో అందుబాటులో ఉంటామని తీర్మానాలు ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ ప్రవాస భారతీయుల స్ఫూర్తి, సుమారు 12 లక్షలు మంది ఎన్నికల సమయంలో స్వదేశానికి వచ్చి ఆంధ్ర రాష్ట్ర లో పార్టీ కి ప్రచారం చేసి రాష్ట్ర పునర్నిర్మాణానికి కంకణం కట్టిన వారికి అభినందనలు తెలియచేశారు. గుంటూరు ఏఎంసి పూర్వ చైర్మన్ మన్నవ సుబ్బారావు తెలుగుదేశం ,ఎన్టీఆర్ నేపధ్యం, చంద్రన్న దూర దృష్టి, లోకేష్ యువ నాయకత్వం మీద మాట్లాడారు. పవన్ కుద్రా,శ్రీకాంత్ కుదిటిపూడి,నరేష్ కోనేరు,వంశీ దాసరి, తిట్టు మద్దిపట్ల, సుమంత్ కొర్రపాటి,వెంకట కంద్ర, శివ నిర్వహణలో జర్మనీ మహానాడు నిర్వహించారు.చిన్నారుల సాంప్రదాయ నృత్యాలతో, సాంస్కృతిక కార్యక్రమాలతో కార్యక్రమం ఆకట్టుకుంది. అతిధుల సత్కారం తో కార్యక్రమం ముగిసింది.



## పిడుగుపాటుకు యువకుడి మృతి



**సంతబొమ్మాళి, మే 24(వార్త):** పెద్ద కేశినాయుడుపేటకు గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. గ్రామానికి చెందిన యువకుడు మోర్చి లక్ష్మీపతి( శివాజి) (26) పోర్టు రహదారి పనులలో భాగంగా టెక్కలి సమీపంలో పనిచేస్తుండగా శనివారం.. పిడుగుపడి మృతి చెందాడు. ఈ సంఘటన జరిగిన వెంటనే సహ చరులు టెక్కలి జిల్లా ఆసుపత్రికి తీసుకువెళ్లారు అయినప్పటికీ ప్రయోజనం లేకపోయిందని గ్రామస్తులు తెలిపారు. చేతికి అందిన కుమారుడు ఇలా విగత జీవిగా కనిపించడంతో తండ్రి వెంకటరావు, తల్లి నారాయణమ్మ బోరున విలపించారు. కొంతకాలంగా పోర్టు పనుల కాంట్రాక్టర్ వద్ద ఎర్త్ వర్క్ మిషన్ కు హెల్పర్ గా లక్ష్మీపతి( శివాజి) పనిచేస్తున్నారు.ఈ విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## నౌపడ మురుగు కాలువలో పూడికతీత



**సంతబొమ్మాళి, మే 24(వార్త):** మండలంలో నౌపడ గ్రామంలో బజారు వీధి లో ఉన్న మురుగునీటి కాలువాల్లో పూడిక తీత పనులను అధికారులు శనివారం శ్రీకారం చుట్టారు. దీంతో మండల స్థాయి అధికారులు, స్థానిక గ్రామపంచాయతీ అధికారులు ఆయా ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులతో పాటు మురుగునీటి కాలువలలో పేరుకుపోయిన పూడికతీత పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఈఓపిఆర్డి పద్మజ పంచాయతీ సెక్రెటరీ ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతను ఆదుకునే సంకల్పం

**-యుద్ధ ప్రాతిపదికన సాగునీటి వనరుల నిర్వహణ పనులు**

**-వంశధార ఎడమ ప్రధాన కాలువ తో పాటు ఉపకాల్వల్లో పూడికతీత పనులు ప్రారంభం**

**-ఎమ్మెల్యే గౌతు శిరీష చిత్తశుద్ధిని కొనియాడిన టీడీపీ నేతలు**



**పలాస, మే 24(వార్త):** ప్రతి చేనుకు నీరు.. ప్రతి చేతికి పని అనే పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష సంకల్పం మేరకు అన్నదాతకు ఆసరాగా యుద్ధ ప్రాతిపదికన పనులు జరుగుతున్నాయని టిడిపి నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పలాస మండలం, లక్ష్మీపురం గ్రామం వద్ద, వంశధార ఎడమ ప్రధాన కాలువకు సంబంధించిన గుర్రాలగెడ్డ లో పూడికతీత పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది కంటే ఈ ఏడాది ముందస్తుగానే వంశధార కాలువ నుంచి సాగునీటిని రైతులు చెంతకు చేర్చేందుకు ఎమ్మెల్యే శిరీష కృషి చేశారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సాగినీటి వనరులను అభివృద్ధి చేసేందుకు కోటి రూపాయల నిధులు మంజూరవగా, ప్రధానంగా వంశధార కాలువతో పాటు మిగిలిన ఉపకాల్వలను అభివృద్ధి చేసేందుకు రూ. 85 లక్షలు వెచ్చించనున్నట్లు చెప్పారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు, నీటి సంఘాల అధ్యక్షులు నీటి వనరుల స్థితిగతులను అంచనా వేసి, నివేదిక రూపొందించారని వారి సేవలను కొనియాడారు. రెండు వారాల్లో పూడికతీత పనులను చేపట్టి సాగునీటిపారుదలకు ఉన్న అడ్డంకులను అధిగమిస్తామని ధర్మ వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పీరికట్ల విఠల్, దువ్వాడ సంతోష్ రామ్ నాయుడు, వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు గొనప నిరంజన్, లక్ష్మి పురం నీటి సంఘ అధ్యక్షులు సిస్టు మురళి, నగరంపల్లి నీటి సంఘం అధ్యక్షులు దువ్వాడ అప్పారావు, కవిటి నీటి సంఘ అధ్యక్షులు దాసరి దాసరధి, అమలకుడియా నీటి సంఘ అధ్యక్షులు వరిశ తారకేశ్వరరావు, టీసీ మెంబెర్స్ యాదల్ల నాయక్ రావు, హేమసుందర్, కోళ్లకోట నీలకంఠం అబ్బాయి, తదితరులు పాల్గొన్నారు.

## నీతి, నిజాయతీగా జీవించాలి

**మందస, మే 24(వార్త):** జీవితంలో ప్రతీ ఒక్కరూ నీతి, నిజాయితీ కలిగి ఉండాలని, ఇదే మనిషికి ఉన్నత శిఖరాలకు తీసుకు వెళ్తుందని మందస గ్రంథాలయం గ్రంథాలయాధికారిణి జె.విజయలక్ష్మి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు నీతి కథలు చదివించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ సమాజంలో మంచి, చెడు గుర్తించాలన్నారు. మంచి మార్గం ఎంచుకున్నప్పుడు మానవ జీవితానికి సార్థకత లభిస్తుందన్నారు. గ్రంథాలయం గ్రంథాలయాధికారిణి జె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు, స్థానికులు పాల్గొన్నారు.




# ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- **పనుల్లో నాణ్యత పాటించండి**
- **నిర్మాణం చేపట్టకపోతే మంజూరైన ఇళ్లు రద్దు**
- **గృహ నిర్మాణ సంస్థ జీఎం వెంకటరమణ**
- **లేఅవుట్ల పరిశీలన, లబ్ధిదారులతో ముఖాముఖి**

**శ్రీకాకుళం, మే 24(వార్త):** ఆంధ్రప్రదేశ్ గృహనిర్మాణ సంస్థ జనరల్ మేనేజర్ (అకౌంట్స్ ఆడిట్) పి. వెంకటరమణ శనివారం శ్రీకాకుళం జిల్లాలో ఒకరోజు విస్తృత పర్యటన చేపట్టారు. గృహ నిర్మాణాల పురోగతి, నాణ్యతను స్వయంగా పర్యవేక్షించి, లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన దృష్టి సారించారు. శ్రీకాకుళం అర్బన్ పరిధిలోని పెద్దపాడు, రాగోలు లేఅవుట్‌లను, అలాగే ఆమదాలవలస అర్బన్‌లో గల గాజులకొల్లివలస లేఅవుట్‌లను వెంకటరమణ సందర్శించారు. ప్రతి లేఅవుట్‌లోనూ మౌలిక వసతుల స్థితి, నిర్మాణాల నాణ్యతను నిశితంగా పరిశీలించారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను, సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం, ఆయా మండలాల్లో లబ్ధిదారులతో సమావేశమై, ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన అదనపు ఆర్థిక సహాయం అంశంపై పూర్తి వివరాలను వివరించారు. లబ్ధిదారులకు తమ నిర్మాణాలపై ఏవైనా సమస్యలు ఎదురైతే, తక్షణమే అధికారులు స్పందించి పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. అలాగే జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గృహనిర్మాణ సంస్థ అధికారులు, సిబ్బందితో వెంకటరమణ శనివారం సాయంత్రం సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో గృహ నిర్మాణ కార్యక్రమాల పురోగతిపై సమగ్ర నివేదికలను ఆయన పరిశీలించారు. ప్రతి లేఅవుట్‌కు సంబంధించిన పనుల ప్రగతి నివేదికలను సమీక్షించి, ఇప్పటికీ ప్రారంభించని మంజూరైన ఇళ్లను రద్దు చేస్తామని హెచ్చరించారు. నరసన్నపేట మండలంలోని లేఅవుట్‌లను కూడా సందర్శించి అక్కడి నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. నిర్మాణాలు జరుగుతున్న ప్రదేశాల్లో పనుల వేగాన్ని పెంచాలని, పనుల్లో నాణ్యత పట్ల రాజీ పడకూడదని స్పష్టం చేశారు. నిర్మాణాల్లో ఎలాంటి రాజీ పడకుండా నాణ్యత ప్రమాణాలను పాటించాలని ఇంజనీర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణ సంస్థ జిల్లా అధికారి బి. నగేష్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, సహాయక ఇంజినీర్లు పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



* పెరిగిన ఆశావహులు * కుదరని ఏకాభిప్రాయం * తలలు పట్టుకుంటున్న నేతలు * అధిష్టానం దృష్టికి * మహానాడు తర్వాత రహస్య ఓటింగ్‌కు నిర్ణయం



# ఇచ్ఛాపురం టీడీపీ అధ్యక్ష పీఠానికి.. ఓటింగ్











**ఇచ్ఛాపురం, మే 24(వార్త):** ఇచ్ఛాపురం పట్టణ తెలుగుదేశం అధ్యక్ష పీఠంపై ఇంకా పీఠముడి వీడ లేదు. తాజాగా ఆశావహులు సంఖ్య పెరగడంతో ఆ పార్టీ అధిష్టానం ఓటింగ్ చేపట్టాలని నిర్ణయం తీసుకు న్నట్లు సమాచారం. వాస్తవానికి మహానాడులోగా సంస్థగత కమిటీ ఎన్నికల ప్రక్రియ పూర్తి కావాలి. జిల్లాలోని దాదాపు అన్ని మండలాల్లో, మున్సిపాలిటీలో పూర్తికాగా ఇచ్ఛాపురం పీఠం మాత్రం క్షణక్షణానికి ఉత్కంఠ రేకిస్తూనే ఉంది. తాజాగా స్వేచ్ఛవతి అమ్మవారి ఆలయ ఆవరణలో పార్టీ పట్టణ సమావేశం జరిగింది. అధ్యక్ష స్థానం కోరుకునేవారు అభిప్రాయం చెప్పాలని కోరగా ప్రస్తుతం రేస్ లో ఉన్న టిడిపి ప్రధాన కార్యదర్శి నందికి జానీ, మూడవవార్డు కౌన్సి లర్ పత్రి తవిటయ్య, ప్రస్తుత పట్టణ అధ్యక్షులు కాళ్ళ ధర్మారావు తనయుడు కాళ్ళ జయదేవ్ యాదవ్, తెలు గుదేశం పార్టీ ఉపాధ్యక్షులు నాగరాజ్ పాత్రో, ఆరో వార్డు కు చెందిన కోర్రాయి ధర్మరాజు తాము రేస్ లో ఉన్నామని ప్రకటించడంతో ఏకాభిప్రాయం కుదరక ఓటింగ్ అనివార్యం అయింది. అయితే సమయం లేకపోవడంతో మహానాడు తర్వాత ఓటింగ్ నిర్వహిం చేందుకు నిర్ణయించుకున్నారని సమాచారం. ఇదే సందర్భంలో 17వ వార్డు ఇన్చార్జి జన్నెల సంతోష్ యాదవ్ ఆశావాహులు ఎవరైనా ఉంటే రహస్యంగా తెర వెనక మంత్రాలు జరుపుకుండా బహిరంగంగా పేర్లు వెల్లడించాలని చెప్పడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. కొంతమంది రేసులో ఉన్నట్లు పత్రికల్లో ఫొటోలు వస్తున్నాయని ఎదురుగా ప్రశ్నిస్తే తమకు అవసరం లేదని అంటున్నారని సంతోస్ పదేపదే అన డంతో అక్కడే ఉన్న 22వ వార్డు కౌన్సిలర్ కాళ్ల దిలీప్ యాదవ్ తనని ఉద్దేశించే మాట్లాడుతున్నారని ఘర్ష ణకు దిగారు. ఇద్దరు మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగి నట్లు సమాచారం. అనంతరం పార్టీ నాయకులు సముదాయించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రేస్ లో ఉన్న ఐదుగురిలో తవిటయ్య, జయదేవ్ ధర్మరాజులు యాదవ సామాజిక వర్గం కాగా నందికి జానీ రెడ్డిక సామాజిక వర్గం, నాగరాజు పాత్రో మైనార్టీ సామాజిక వర్గానికి చెందినవారు ఉన్నారు. ఓటింగ్ లో మున్సిపా లిటీకి చెందిన 23 వార్డులకు సంబంధించిన తెలుగు దేశం పార్టీ కౌన్సిలర్లు, పార్టీ ఇన్చార్జిలు పాల్గొంటారు. ఆరు కౌన్సిలర్ స్థానాలు ఉండగా 17 మంది పార్టీ ఇన్చార్జిలు ఉన్నారు వీరంతా ఓటింగ్‌లో పాల్గొని మెజార్టీ ఓట్ల అభిప్రాయంకి అధ్యక్షునిగా ఎన్నిక ఉం టుంది. అయితే బహిరంగంగా చేతులెత్తితే కక్ష సాధింపు చర్యలు ఉంటాయని భావించి రహస్య ఓటింగ్ కు పట్టుబడుతున్నట్లు సమాచారం. ఒక స్థానా నికి పోటీ చేసిన వారు ఒకవేళ పీఠం పెట్టకపోతే మరో స్థానానికి పదవి కోరే విధంగా ఉండకుండా చర్యలు తీసుకోవాలని అధిష్టానం భావిస్తున్నట్లు సమాచారం.

## వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి

* **డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ**

**ఆమదాలవలస, మే 24 (వార్త):** వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని, అప్పులబాట పట్టిందని, ప్రజల సమస్యలను పట్టించుకునే వారు కరువయ్యారని డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ అన్నారు. శనివారం ఆమదాలవలస టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆ పార్టీ నాయకులు అవినీతికి కేంద్రాలుగా మారిపోయారన్నారు. ఆ పార్టీ ఆమదాలవలస నియోజకవర్గ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ కూటమి ప్రభుత్వంపై, టీడీపీ నాయకులపై చౌకబారు ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు బోర గోవిందరావు, అంబళ్ల రాంబాబు, ఇంజరాపు విశ్వనాథం, మీసాల రామారావు, తంగి గురయ్య, బీవీ రమణమూర్తి, కందుల వెంకటరావు, బోనెల అప్పారావు పాల్గొన్నారు.



## దొంగతనం కేసులలో నలుగురు అరెస్టు




**ఎచ్చెర్ల, మే 24 (వార్త):** ఎచ్చెర్ల మండలంలోని కేశవరావునిపేట జాతీయరహదారికి ఆనుకుని తాళం వేసి ఉన్న ఇంట్లో జరిగిన చోరీకి పాల్పడిన నలుగురిని అరెస్టు చేశామని డీఎస్పీ సీహెచ్ వివేకానంద తెలిపారు. వారి నుంచి దొంగిలించిన సొత్తును స్వాధీనం చేసుకున్నామ న్నారు. అల్లు రవికుమార్, టొంపల కోమలరావు, మోహన్‌నాయుడు, సింహాచలంలు జల్సాలకు అల వాటు పడి పలు ఇళ్లు, ఆలయాల్లో దొంగతనాలకు పాల్పడ్డారన్నారు. వారు దొంగసొత్తును విక్రయించేం దుకు వస్తుండగా పొన్నాడ జంక్షన్ వద్ద పోలీసులు పట్టుకున్నారన్నారు. దొంగలను పట్టుకోవడంలో ఎచ్చెర్ల ఎస్ఐ వి.సందీప్ కుమార్, ఏఎస్ఐ కె.రమేష్ దేవ్, హెచ్‌సీ జి.జగదీశ్వరరావు, కానిస్టేబుళ్లు కె.దివా కర్, కె.శ్రీనివాసరావు, సీహెచ్ గణేష్‌లను ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, ఏఎస్పీ, డీఎస్పీలు అభినందించారు.

## మైనర్ బాలికపై అత్యాచారం

**భామిని, మే 24 (వార్త):** భామిని మండలం ఇటీవల జరిగిన ఘటన మరువకముందే ఇదే మండలంలో పదేళ్ల బాలికపై అదే గ్రామానికి వ్యక్తి అత్యాచారాయత్నానికి పాల్పడిన ఘటన చోటు చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు వెంటనే బత్తిలి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గురువారం అర్ధరాత్రి నిందితుడిని బత్తిలి పోలీసులు అదుపులోకి తీసు కున్నారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

## నలుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

**శ్రీకాకుళం క్రైం, మే 24 (వార్త):** శ్రీకాకుళం నగరంలోని హయాతినగరంలో శనివారం రాత్రి పేకాట ఆడుతున్న నలుగురిని వన్‌టౌన్ పోలీసులు పట్టుకున్నారు. వారిని నుంచి రూ.40వేలు నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546